క్లుప్తంగా

మంత్రికి వినతి


డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌కేపీ ఉద్యోగులు

సాలూరు: వైఎస్సార్ క్రాంతిపథంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారించాని కోరుతూ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు అతని స్వగృహంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారంపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఉద్యోగులు తెలిపారు.

విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. నియోజకవర్గ స్థాయి విజేతలు జిల్లా స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, నాయకులు కల్లెపల్లి త్రినాథ, ముచ్చల ఆదయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్పర్శపై అవగాహన


అంపావల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజలు

బలిజిపేట: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మండలంలో స్పర్శ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాలు మంగళవారం ప్రారంభించారు. అందులో భాగంగా బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాధురి అధ్వర్యంలో అంపావల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. లెప్రసీ వ్యాధి ప్రమాదకరమైనది కాదని ధైర్యం చెప్పారు. అది అంటువ్యాధి కాదని, స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. లెప్రసీ వ్యాధిగ్రస్తులను దరికి చేర్చి వారికి అవసరమైన సేవలు చేయాలని కోరారు. వ్యాధి ప్రారంభదశలో గుర్తిస్తే వెంటనే దానికి తగిన మందులు వినియోగించడం వల్ల నియంత్రించవచ్చన్నారు. ప్రజలు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈఓ కర్ణ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


గారీపురంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత, అధికారులు

బలిజిపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ హేమలత మంగళవారం పర్యవేక్షించారు. ఈ మేరకు గారీపురం, బలిజిపేటలలో పోలింగ్ కేంద్రాలైన ప్రాథమిక పాఠశాలల వద్ద మౌలిక సదుపాయాల కల్పన ఉండాలని ఎంఈఓ-1సామల సింహాచలానికి సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయం, తాగునీరు, ర్యాంప్, ఫ్యాన్లు, ఫర్నిచర్, తలుపులు, కిటికీలు తదితర మౌలిక సదుపాయాల కల్పన ఉందో? లేదో? పరిశీలించారు. చెల్లెంపేట వద్ద కొత్తగా నిర్మించిన ర్యాంప్‌ను గమనించారు. మౌలిక సదుపాయాలు సక్రమంగా లేనిచోట పనులు త్వరితగతిన పూర్తిచేయించాలని సూచించారు. వాటికి సంబంధించిన నిధులు పాఠశాలలకు జమ అయ్యాయని, వాటిని ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 సామల సింహాచలం, రీ సర్వే డీటీ రమేష్‌నాయుడు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్క చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- పార్వతీపురం మండల మహిళా సంఘాలకు ఆసరా చెక్కు అందజేత


నమూనా చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆసరా పథకం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం మండల కేంద్రంలోని వెంకంపేటలో వైఎస్సార్ ఆసరా పథకం కింద నాల్గవ విడత రుణ మాఫీ చెక్కులను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సీఎం జగన్‌మోహన్ రెడ్‌డ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసరాతో అక్కాచెల్లెమ్మలకు జగనన్న అండగా నిలిచారని చెప్పారు. ప్రజా సంకల్పయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు గతంలో నాలుగు విడతలుగా రుణమాఫీ నగదు అందించామని, నాల్గవ విడత సైతం పంపిణీ చేసినట్లు తెలిపారు. మహిళల జీవన ప్రమాణాలు మార్చాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా మహిళల బకాయిలు రద్దు చేస్తామని చెప్పి మోసం చేశాడని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలను రుణ విముక్తులను చేసేందుకు వైఎస్సార్ ఆసరా పథకానికి నాల్గవ విడతగా మండలంలోని 1154 సంఘాలకు చెందిన 12,632 మంది మహిళలకు రూ.6.09 కోట్లు అందజేశామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మాజీ శోభారాణి, ఏఎంసీ చైర్‌పర్సన్ మరడాన భాగశ్రీ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఆత్మ చైర్మన్ వై. తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, మహిళలు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థికంగా ఆదుకుంటున్నారు



ఆసరా డబ్బులు నాలుగు విడతలు కలిపి సుమారు రూ.50 వేలు అందాయి. ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతోంది. చిన్న కిరాణా షాపు పెట్టుకుని ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నాం. మళ్లీ సీఎంగా జగనన్న రావాలి. మా బతుకులు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశతో ఉన్నాం.

– కె. గౌరమ్మ, పార్వతీపురం మండలం

ఆసరాతో ఎంతో లబ్ధి చేకూరింది



ఇంటి ఖర్చులకు సైతం ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఆసరా డబ్బులు నాలుగు విడతలు కలిపి సుమారు రూ.1.10లక్షలు మా సంఘానికి వచ్చాయి. ఇటు కుటుంబ పోషణ భారం తప్పింది. అటు నాకు ఒక పని దొరికింది. మాకు ఇంతకంటే ఎంకావాలి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎస్.రత్నకుమారి, పార్వతీపురం మండలం

ప్రశాంత జీవనం



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక భరోసా దక్కడంతో ప్రశాంతంగా జీవనం కొనసాగిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో రూ.40 వేలు చెల్లించినందుకు చాలా ఆనందంగా ఉంది. బ్యాంకులు ఎక్కువగా రుణాలు అందిస్తున్నాయని, వాటితో వ్యాపారం సజావుగా జరుగుతోంది.

– వి.వరలక్ష్మి, పార్వతీపురం మండలం

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు


వైద్యసేవల గురించి మాట్లాడుతున్న డీఎంఓ జగన్మోహనరావు

సీతానగరం:

జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)-2 వైద్య శిబిరాలను అనారోగ్యానికి గురవుతున్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీతానగరం మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీ పరిరిధిలో ఉన్న కేఎస్ పురంలో పీహెచ్‌సీ డాక్టర్స్ రాధాకాంత్, ప్రభుతేజా ఆధ్వర్యంలో నిర్వహించిన జేఏఎస్-2 వైద్యశిబిరాన్ని పరిశీలించారు. శిబిరం వద్ద ఏర్పాటుచేసిన కౌంటర్లను, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను, ఎటువంటి వ్యాధులతో ఇబ్బందులుపడుతున్న రోగులు వస్తున్నారో తెలుసుకున్న అనంతరం మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన రోగుల వివరాలను సచివాలయ సిబ్బంది చేస్తున్న రిజిస్ట్రేషన్, టోకెన్ల జారీ, నిర్వహించిన పరీక్షలు, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్కడ వైద్యసేవలు వినియోగించుకోడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో నిర్వహించిన జేఏఎస్ ఉచితవైద్యశిబిరాల్లో వైద్యసేవలు పొందిన వారికి ఇక్కడి శిబిరంలో మళ్లీ మందులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జి. సూర్యనారాయణ, సర్పంచ్ యు.విజయలక్ష్మి, ఎంపీటీసీ వై.అరుణకుమారి, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కులగణన వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరుగుతున్న కులగణన కార్యక్రమం వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన పణుకుపేట, కేఎస్ పురం, రంగంపేట సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న కులగణనపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన పూర్తయితేనే అన్ని కులాలకు ఆర్థికపరంగా లబ్ధిచేకూరుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేస్తున్న కులగణనకు ప్రజలు సహకరించి వారికి అవసరమైన సమాచారం అందించాలని కోరారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు.

సైబర్ మోసాలపై అవగాహన


పట్టణ ఎస్సై రవీంద్ర రాజు

పార్వతీపురంటౌన్: సైబర్ మోసాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పార్వతీపురం పట్టణ ఎస్సై బి.రవీంద్ర రాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ సాధారణంగా సైబర్ నేరాల్లో రెండు రకాలు ఉంటాయని ఒకటి ఫైనాన్షియల్, రెండవది నాన్ ఫైనాన్షియల్ అని చెప్పారు. ఫైనాన్షియల్లో డబ్బులు కోల్పోతామని, నాన్ ఫైనాన్షియల్ అంటే ఫిజికల్ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో జరిగే విషయాలని తెలిపారు. ఫైనాన్షియల్ ఫ్రాడ్‌లో ఓటీపీ (వన్ టైం పాస్వర్డ్) ఫ్రాడ్ గురించి వివరిస్తూ ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరిపేటప్పుడు మన ఫోన్‌కు ఓటీపీ వస్తుందన్నారు. అది బ్యాంకు సెక్యూరిటీ ఫీచర్. ఈ ఫీచర్ వల్ల మన డబ్బుకు సెక్యూరిటీ ఉంటుంది. ఆ ఓటీపీ నంబర్ మీరు తెలిపితేనే డబ్బులు పంపిస్తారు. ఆ ఓటీపీ నంబరును సైబర్ నేరస్తులు క్యాచ్ చేయడం గానీ, మన మొబైల్‌ను హ్యాక్ చేయడానికి ట్రై చేయడం జరుగుతుందని, అందుకు ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఎక్కువగా ఉన్నాయి. అందరికీ డబ్బులు డైరెక్ట్‌గా బ్యాంక్ అకౌంట్‌లో పడుతున్నాయి. ఈ నేపథ్యంలో మేము వెల్ఫేర్ స్కీమ్ నుంచి మాట్లాడుతున్నాం. ఏమైనా సంక్షేమ పథకాలకు మీరు అర్హులో కాదో చూడాలి లేదా ఇంకేమైనా పథకానికి అర్హత ఉందో లేదో చూడాలి, మేము తెలుసుకుని చెబుతాము మీ వివరాలు తెలపండని అడిగిన సందర్భంలో ఎలాంటి ఓటీపీ తెలపరాదని, మీకు అందుబాటులో గ్రామ సచివాలయం, బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ ఉన్నాయి కాబట్టి ఎప్పుడూ ఓటీపీ చెప్పకూడదని చెబితే నష్టపోతారని హెచ్చరించారు.

శంబర మురిసింది...

శంబరకు భక్తజనం పోటెత్తారు.. తొలి జాతర తరహాలోనే మారు జాతరకు సుమారు లక్షన్నర మంది భక్తులు రావడంతో గ్రామం భక్తజన సంద్రంగా మారింది.. జై పోలమాంబ నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగిపోయింది. ఎటువైపు చూసినా అమ్మను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులే కనిపించారు.. క్యూలైన్లు నిండిపోవడంతో గోముఖీ బ్రిడ్జి వరకు బారులు దీరారు.. చదురుగుడిలో అమ్మవారిని దర్శించుకునే సమయంలో భక్తులు ఇబ్బంది పడకుండా సీఐ ధనుంజయరావు, ఎస్సైలు ప్రయోగమూర్తి, నరసింహమూర్తి, దేవదాయశాఖ అధికారులు డీవీవీ ప్రసాదరావు, వీవీ సూర్యనారాయణ, తదితరులు తగిన ఏర్పాట్లు చేశారు.

– మక్కువ




అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


నది ఒడ్డున వంటలు , (ఇన్‌సెట్లో) వనంగుడిలో పూజలందుకుంటున్న పోలమాంబ మేనత్త పెదపోలమాంబ


తలనీలాలు సమర్పించుకుంటున్న చిన్నారి


అమ్మవారిని దర్శించుకునేందుకు శంబర చేరుకున్న భక్తులు


సిరిమాను బండికి పూజలు చేస్తున్న భక్తులు


చదురుగుడి బయట క్యూలైన్‌లో భక్తులు


వేపచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

వాహన చోదకులు హెల్మెట్ వాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రవాణాశాఖాధికారి మల్లికార్జున రెడ్డి

పార్వతీపురంటౌన్:

ద్విచక్ర వాహన ధారులందరూ విధిగా ఐఎస్ఐ మార్క్ కలిగిన హెల్మెట్‌ను ధరించి వాహనం నడపాలని జిల్లా రవాణాశాఖాధికారి మల్లికార్జునరెడ్డి కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా రవాణా శాఖాధికారి అధ్వర్యంలో పట్టణంలోని డ్రైవర్స్‌కు (ఆటో డ్రైవర్స్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్స్, లారీ డ్రైవర్స్‌కు) జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బంది సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎస్ఐ ఆమోదం పొందిన మార్క్‌తో కలిగిన హెల్మెట్‌ను ధరించకుండా, ఎటువంటి హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపి జిల్లా రవాణా శాఖ, పోలీస్ శాఖ చేసే తనిఖీల్లో పట్టుబడితే అపరాధ రుసుం విధించడమే కాకుండా మోటార్ వాహన చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు శశికుమార్, ఎంవీఐ, జి. సత్యనారాయణ వాహన డ్రైవర్స్‌కు ఆరోగ్యం, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ ప్రమాదాలు, అధిక ప్రయాణికులతో ప్రయాణం, హెల్మెట్ ధారణ, ఓవర్ స్పీడ్ ఇతర రహదారి భద్రతపై పూర్తి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవాణాశాఖ, వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన వారు పాల్గొన్నారు.

బాపూజీ ఆశయసాధనకు పాటుపడదాం


పెదపెంకిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దలు


సీతానగరం: గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రమణమ్మ, సభ్యులు

బలిజిపేట: బాపూజీ ఆశయసాధనకు అందరం పాటుపడాలని బలిజిపేట స్టేట్‌బాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ అన్నారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన బలిజిపేట మండలంలోని పెదపెంకి గ్రామంలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేందుకు కారకులైన బాపూజీ స్వాతంత్ర్యం అనంతరం భారతదేశం అత్యున్నత స్థానంలో ఉండాలని ఊహించారు. ఆయన ఆశయసాధనకు అందరం కలిసి పాటుపడాలని పిలుపునిచ్చారు. మహోన్నతమైన భావాలు కలిగిన వ్యక్తి అవడంతో గాంధీని మహాత్ముడని పిలుస్తున్నామన్నారు. దేశంలో అన్ని వర్గాల వారిని ఏకతాటిపైకి తీసుకువచ్చి అహింసా మార్గంలో ముందుకు నడిపించిన ఘనత ఆయనకే దక్కుతుందని, అటువంటి మహనీయునికి నివాళులర్పించడం ఎంతో అదృష్టమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవ నాయుడు, జి.అప్పలనాయుడు, సీహెచ్.సత్యంనాయుడు, యువకులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీజీకి నివాళులు

సీతానగరం: మండలంలోని ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో ఎంపీపీ బలగ రమణమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందుగా మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మండలసభ్యులు, అధికారులు కలిసి మహాత్మా గాంధీజీ చిత్రపటం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను శాఖల వారీగా వివరించాలని అధికారులను కోరారు. ఈ మేరకు వ్యవసాయ పద్దులపై ఏఓఅవినాష్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం విక్రయాలు చేయడానికి ప్రజా ప్రతినిదులు అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. ప్రభుత్వం పేదలకు ఇళ్లవద్దనే ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్యసేవలు అందించిందని, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం ఇళ్లకు అందజేస్తోందని ఆశాఖ సూపర్‌వైజర్ సమాధానమిచ్చారు. అలాగే అన్నిగ్రామాలకు ఇంటింటి కుళాయిల పనులు చురుగ్గాజరుగుతున్నాయని ఆశాఖ ఏఈ పవన్‌కుమార్ తెలియజేశారు. విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. నాడు నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రభుత్వ విద్యాలయాల్లో కార్పొరేట్ స్థాయి విద్యను ఆంగ్లంలో బోధిస్తున్నామని ఎంఈఓలు వెంకరమణ, సూరిదేముడు వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైద్యాధికారి పావని, పశువైద్యాధికారి రామారావు, ఆర్టీసీ, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరా నిలిపివేత

సాలూరు:

హెడ్ వాటర్‌వర్క్స్‌'కు సంబంధించిన మోటార్ పాడవ్వడంతో బుధవారం మరమ్మతులు చేపట్టనున్నామని, ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జయరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి

గుమ్మలక్ష్మీపురం: పాఠశాలల్లో కనీస అవసరాలు తీర్చుకునేందుకు మంజూరైన స్కూల్ మెంటెనెన్స్ ఫండ్(ఎస్ఎంఎఫ్) సక్రమంగా వినియోగించుకోవాలని ఎంఈఓలు బి.చంద్రశేఖర్, బి.జనార్దననాయుడు అన్నారు. స్థానిక ఎంఆర్‌సీలో మంగళవారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 140 పాఠశాలలకు ఎస్ఎంఎఫ్ నిధులు మంజూరయ్యాయన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన 52 పాఠశాలల్లో ఎస్ఎంఎఫ్ నిధులతో తాగునీరు, మరుగుదొడ్లు, ఎలక్ట్రిఫికేషన్, ఫర్నీచర్, ర్యాంప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.